

# వేదఘోష

"కమిన్, మిష్టర్! నీ పేరు...? సుబ్బారావు కదూ! నీరసంగా ఉన్నట్లున్నావ్? భోంచేసే వచ్చావు గదా? "

"యస్, సర్! ఇంటర్వ్యూగదా అని ఇవ్వాళ తెల్లారే లేచి వంట చేసుకుని పెందరాళే భోంచేసి వచ్చేశానండీ!"

"వ్హాట్? ... నువ్వు వంట కూడా చేస్తావా? "

"సార్! మీరిప్పుడు ఇంటర్వ్యూ చేస్తున్నది మీ ఆఫీసులో క్లర్కుపోస్టుకే గానీ, మీ ఇంట్లో వంటవాడి కోసం కాదు గదాండీ? "

"అబ్బే! అందుక్కాదులే! భయపడకు మిస్టర్! ఫిలాసఫీలో, సైకాలజీలో డబుల్ ఎమ్మేవి గదా! మరి వంట కూడా నువ్వే వండుకు తింటావా? అని ఆశ్చర్యంవేసి అడిగానంతే!"

"ఎంత ఫిలాసఫీ ఎమ్మే అయినా వండుకోకుండా ఎలా తినగలం సార్! కడుపునొప్పి వస్తుంది గదండీ!"

"అవునవును! సరే, అదలా వదిలేద్దాం! ఇప్పుడు మాకు కావాల్సిందో క్లర్కు, మరి, నీవేమో డబుల్ ఎమ్మేవి. ఎలా చావడం...? "

"ఈ మాత్రానికి మీరు చావటం ఎందుకుసార్! ఆ క్లర్క్ పోస్టేదో నా మొహాన కొడితే, ఆ చావేదో నేనే చస్తాను గదా!"

"అదే నా బాధ! ఎలా చావాలో తెలీక నీ ఫిలాసఫీతో మమ్మల్ని చంపుతావేమోనని...!"

"ఫర్వాలేదు. నాకు టైపు, ఎకౌంటెన్సీ కూడా వచ్చునైండి!"

"ఏమిటీ...? "

"అవును సార్! షార్ట్‌హ్యాండ్ కూడా హయ్యర్ పాసయ్యాను!"

"ఓహో! అయితే, ఇంటర్వ్యూ మొదలెడదామా!"

"రెడీ సర్! కానీ మన్లోమాట! మీ పెద్దల తాలూకు కాండిడేట్స్ ఎవరూ లేరు గదాండీ, ఈ పోస్టుకోసం!"

"అలాంటి రహస్యాలు అడగ్గూడదు తమ్ముడూ! సరే! నీవు సైకాలజీ ఎమ్మేవి కదూ! సైకాలజీ అంటే...? సైకిళ్ళు...? "

"నో! నో! సర్! సైకిళ్ళ తయారీకి సంబంధించిన శాస్త్రం కాదండి అది. అచ్చ తెలుగులో మనస్తత్వశాస్త్ర మంటార్లెండి!"

"మనస్ + తత్వాశాస్త్రమా? "

"అవునండీ. మనసుల్లో దూరి వాటిని చదివెయ్యటం!"

"చదివి...? "

"ఇలా ఇంటర్వ్యూలకు హాజరవటం!"

"మరి ఫిలాసఫీ అంటే? ... పిల్లుల్ని సఫా...? "

"ఓ రకంగా అలాంటిదేననుకోండి! ఆ సఫీ బాగా వంటపడితే మనం పక్కింటి వాడి కోడి పిల్లను మనదే అనుకుని బొమికెల్తో సహా భోంచేసి, నిశ్చింతగా నిద్రబోవచ్చునండీ!"

"మరి, ఆ ప్రక్కింటివాడు మక్కెలిరగదన్నడా? "

"తెలిస్తే తంతాడనుకోండి కానీ ఫిలాసఫీ వంటబట్టి ఉంటే, కోడిపిల్ల మిధ్య, దాన్ని మనం కోసి, పులుసొండుకు భోంచెయ్యటం మిధ్య, మన మక్కెలు విరగటం మిధ్య అనుకుని, వేన్నీళ్ళు కాపడం వేసుకుని నిద్రబోవచ్చు గదాండీ!"

"నిజమే సుమా! కానీ, ఆ వేన్నీళ్ళు కూడా మిధ్య అనుకుంటే అసలు కాపడం వేసుకునే శ్రమే లేకుండానే నిద్రబోవచ్చు గదా!"

"అదీ నిజమేనండీ! ఓసారి ఆచార్య నాగార్జునుల వారు..."

"ఎవరాయన! మీ ప్రక్కింటి కోడిపిల్ల ఓనరా? "

"కాదండీ! నాగార్జునకొండ అని..."

"అవునవును! నాగార్జునకొండ కట్టించిన దేశభక్తుడు!"

"కొండగాదండీ! సాగర్..."

"ఓహో! నీవు చెపుతున్నది నాగార్జునసాగర్ డామ్ చీఫ్ ఇంజనీరు సంగతా! వాడు నాకూ తెలుసులే! సరే గానీ, ఆ డామ్ ఎక్కడుందో తెలుసా!"

"ఇంకా అక్కడే ఉంది గదాండీ!"

"ఎక్కడా? "

"నాగార్జునసాగర్‌లోనేనండీ!"

"అంటే? సాగర్ లోపలనా? లేక పైన అనా నీ ఉద్దేశ్యం? "

"సగం పైనా, సగం లోపలా అనుకుంటానండీ!"

"మరయితే సాగర్ ఎక్కడుందంటావ్? "

"ఇంకెక్కడుంటుంది! ఆ డామ్‌కు అటూ - ఇటూనే గదాండీ!"

"శభాష్, నీకు జనరల్ నాలెడ్జ్ కూడా బాగానే ఉంది. అయితే ఇంతకీ ఆ డామ్ వల్ల దేశానికి ఏమిటి లాభం? "

"లేకేమండీ! అక్కడ కంట్రాక్టులు చేసిన మా ప్రక్క వీధాయన ఫస్ట్‌క్లాస్ మేడ కట్టించు కుని, పిల్లాపీచుతో కార్లో సుఖంగా తిరుగుతున్నాడు!"

"అంతేనా? "

"ఇంకా చాలా ఉన్నాయండీ! నా క్లాస్‌మేట్ మూర్తిగాడి ఫాదర్ ఎప్పుడో పాతికవేలు పెట్టి ఆ ప్రాజెక్టు క్రింద పాతికెకరాలు కొన్నాడు. ఈ మధ్యే అదంతా అమ్మేసి ఈ ఊళ్లోనే విద్యార్థుల సౌకర్యార్థం ఓ ఏర్ కండిషన్డు సినిమాహాలు, దానికెదురుగా ఓ బ్రాందీ షాపు, ఆ ప్రక్కనే ఓ ఏర్‌కూల్డ్ బార్ తెరిచాడు! ఎంత లాభమో చూడండీ!"

"బ్రాందీ బాగుంటుందంటావా? "

"సార్...! సార్...!"

"సిగ్గుపడకు తమ్ముడూ! ఇలాంటి వెధవ ప్రశ్నలు నేను వెయ్యకా తప్పదు. నువ్వు చెప్పకా తప్పదు. ఇదో తద్దినం అనుకో! కనీసం నిన్ను ఓ అయిదు నిమిషాలన్నా ఇక్కడ కూర్చోబెట్టాలిగదా!"

"మన్లోమాట సార్! కొద్దిగా పుచ్చుకుంటే మేఘాల్లో తేలిపోవచ్చు! పీకల్దాకా తాగితే స్వర్గమే అందుకుని, లేని అప్సరల్ని కూడా వాటేసుకోవచ్చు!"

"అనుభవజ్ఞుడవేనన్నమాట!"

"ఏదో మీ అభిమానం! నాకీ ఉద్యోగమే రావాలిగానీ మొదటి నెల జీతంతో మా మూర్తి గాడి ఫాదర్‌గారి బార్‌లో మీకా స్వర్గం చూపించనూ"

"చాల్చాలు! సరేగానీ, స్వర్గం అనేది నిజంగా ఉందంటావా...? "

"లేకేం సార్! మా మూర్తిగాడి ఫాదర్‌గారి డీలక్స్ సిన్మాహాల్లో కూర్చుని రంగుల హిందీ సిన్మా చూస్తుంటే స్వర్గంలో ఉన్నట్లే ఉంటుందండీ!"

"కనుక, దేవుడు కూడా ఉన్నాడంటావ్? "

"నాకు అనుమానంగానే ఉంది సార్!"

"ఏం? ఎందుకని? "

"నేను పరీక్షప్యాసవగానే తిరుపతి వెళ్ళి 'దేవుడా, నాకు త్వరగా ఉద్యోగం ఇప్పిస్తే మళ్ళీ నీకొండకు వచ్చి గుండు చేయించుకుంటా'నని మొక్కుకుని రెండేళ్ళయినా ఇంకా ఉద్యోగం దొరకలేదండీ"

"తప్పు. అలా అనుకోగూడదు తమ్ముడూ. దేవుడికయినా సరే రికమండేషన్ కావాల్సిందే. తలకాయలకే విలువలేని ఈ రోజుల్లో వాటి మీద ఫ్రీగా మొలిచే జుట్టుకేం విలువ. నువ్వసలు పనిలోపనిగా బీబీ నాంచారికి కూడా మీ ప్రక్కింటి వాడి కోడిపిల్లను మొక్కుకోవాల్సింది."

"నాకా సంగతి తట్టలేదుగానీ, మీ తెలివితేటలు అమోఘం సార్. అందుకే ఆఫీసర్ అయ్యారు తమరు. నాకీ ఉద్యోగం ఇస్తిరా మీ శిష్యరికంలో ఇలాంటివన్నీ నేర్చుకుని బాగుపడతాను"

"అదలా ఉండనీ. మరి దయ్యాల సంగతేమిటి? ఉన్నాయంటావా? "

"దయ్యాలా? మన పుణ్యభూమిలో వాటికేం లోటండీ"

"ఎలా చెప్పగలవూ? "

"నిస్సందేహంగా. నాకు వాటితో బాగా పరిచయం ఉందండీ"

"వాట్...? వ్హాట్...? "

"నేను చాలా దెయ్యాల్ని చూట్టమేగాదు, వాటితో మాట్లాడాను కూడానండీ"

"నిజం...గానే..."

"యస్సార్: మన భారతీయ దయ్యాలు వేదాలు చాలా తెలివిగా వల్లిస్తాయండీ"

"సరిగ్గా చెప్పు తమ్ముడూ"

"తిరుపతి వెళ్ళొచ్చాక ఈ రెండేళ్ళలోనూ ఓ యాభయ్యయిదు ఇంటర్వ్యూల కన్నా వెళ్ళి ఉంటానండీ"

"యాభయ్యయిదే? దురదృష్టవంతుడిలా ఉన్నావు: జాతకం చూపించుకున్నావా?

ఏదన్నా గ్రహశాంతి...? "

"నా జాతకం వాళ్ళే చెప్పేశారండీ? "

"ఎవరూ? "

"ఆ ఇంటర్వ్యూలు చేసిన దయ్యాలేనండీ? "

"వ్వాట్...? "

"అవునండీ, నే చదివిన సైకాలజీ, ఫిలాసఫీ జోడించి చూస్తే వాళ్ళు నాకు అసలు-సిసలు దయ్యాల్లాగే కన్పించారండీ"

"ఎందుకని...? "

"వాళ్ళు నాకు మానవత్వం గల వాళ్ళలా కన్పించలేదండీ: కడుపు మాడ్చుకుని మిగిల్చిన డబ్బు ఆప్లికేషను ఫీజు పేరుతో మ్రింగివేసింది చాలక, ఇంటర్వ్యూలకు పిలిచి, నానా చెత్త ప్రశ్నలూ వేసి నాచేత వాగించింది చాలక, ఆఖరికి నా కన్నా చవటలకు ఆ ఉద్యోగాలిచ్చే శారండీ"

"పాపం. వాళ్ళనన్యాయంగా తిట్టకు. అర్థం జేసుకో"

"చేసుకోబట్టే వాళ్ళంతా నాకు వేదాలు వల్లించే దెయ్యాల్లా అగుపించారండీ? "

"కాస్త తగ్గు తమ్ముడూ"

"తగ్గబట్టే ఇలా తగలడ్డానండీ. ఇంత క్రూరమైన ఇంటర్వ్యూ తతంగాలు నడిపే దెయ్యాలు ఇంకెక్కడా ఉండవండీ. అవి మన పుణ్యభూమికే స్పెషల్ దెయ్యాలండీ"

"మరీ అంత దేశభక్తి లేకుండా మాట్లాడకు: వాళ్ళ ఇబ్బందుల్ని కూడా చూడవద్దా మనం"

"ఏమిటండీ చూట్టం? అనుభవిస్తున్నాను గదా:"

"ఆ బాధలు నీకింకా తెలీవు తమ్ముడూ. నా సంగతే చూడు. ఇప్పుడీ ఉద్యోగం డబుల్ ఎమ్మేగాదు. ట్రిబుల్ ఎమ్మేగాడు వచ్చినా సరే మా బామ్మర్దిగారి బియ్యే తమ్ముడికే ఇచ్చేయ్" అని రాత్రికి రాత్రి మా మేనేజింగ్‌డైరెక్టర్ నాకుఫోన్‌లో చెప్పినట్లే, వాళ్ళక్కూడా ఎవరేనా మంత్రో, పై ఆఫీసరో చెప్పి ఉండొచ్చుగదా. మరి వాళ్ళేం చేయగలరు చెప్పు? "

"అయితే, ఈ ఉద్యోగం...? "

"అలాంటి రహస్యాలు అడగకూడదు తమ్ముడూ. మా ఎండీ గారికి ఏ మంత్రిగారు చెప్పారో మనకేం తెలుస్తుందీ? "

"మరి నన్నింత సేపూ ఇలా నవ్విస్తూ, ఏడిపిస్తూ కూర్చున్న మీరు కూడా...? "

"ఊఁ..."

"మీరు కూడ ఆ దెయ్యాల లిస్టులోని..."

"ఆ...: వాట్....? వాఁ...! నాన్సెన్స్, షటప్, గెటౌట్! ఒరే, బోయ్, బోయ్, అర్జంటుగా ఓ గ్లాసుడు కోల్డ్ వాటర్..."

*(1973)*

☆